

epaper.manachourasta.com

# మన చౌరాస్తా

The Complete News way


09.06.2024
ఆదివారం

సంపుటి : 01 | సంచిక : 51 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | పేజీలు : 04


## అక్షర సూర్యుడికి..

# అశ్రునివాళి

- తరలి వచ్చిన రాజకీయ, సినీ ప్రముఖులు
- నేడు ప్రభుత్వ లాంఛనాలతో అత్యక్రియాలు





**హైదరాబాద్, మన చౌరాస్తా :** తెలుగుజాతి మేరునగధీరుడు, రామోజీ గ్రూపు సంస్థల అధినేత రామోజీరావు కన్నుమూశారు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న 87 ఏళ్ల రామోజీరావు, హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విచారు. ఈ నెల 5న ఆయన అనారోగ్య సంబంధిత సమస్యలతో ఆసుపత్రిలో చేరారు. రామోజీరావును పరీక్షించిన వైద్యులు స్టెంట్ అమర్చారు. అనంతరం ఐసీయూలో ఆయనకు చికిత్స అందించారు. ఆరోగ్యం విషమించి ఈ తెల్లవారుజామున 4 గంటల 50 నిమిషాలకు ఆయన తుదిశ్వాస విడిచారు. అనంతరం ఆసుపత్రి నుంచి రామోజీరావు పార్థివదేహాన్ని రామోజీ ఫిల్మ్‌సిటీకి తరలించారు. రామోజీ ఫిల్మ్‌సిటీలోని కార్పొరేట్ బిల్డింగ్‌లో రామోజీ పార్థివ దేహాన్ని ఉంచగా కుటుంబసభ్యులు భావోద్వేగంతో నివాళులర్పించారు.

అనంతరం వివిధ రంగాల ప్రముఖులు, సంస్థ ఉద్యోగులు రామోజీ రావుకు అశ్రు నయనాలతో నివాళులర్పించారు. ఆయనతో తమ అనుబంధాన్ని గుర్తుచేసుకొని కన్నీటి పర్యంతమయ్యారు. రామోజీ ఫిల్మ్‌సిటీలో రేపు ఉదయం 9 నుంచి 10 గంటల మధ్య రామోజీరావు అంత్యక్రియలు జరగనున్నాయి. అంత్యక్రియలను అధికారిక లాంఛనాలతో నిర్వహించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశాల కోసం దిల్లీ వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అక్కడ నుంచే తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఆదేశాలు జారీ చేశారు. ఏర్పాట్లను పర్యవేక్షించాల్సిందిగా రంగారెడ్డి జిల్లా కలెక్టర్, సైబరాబాద్ కమిషనర్‌కు సీఎస్ ద్వారా రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. మరోవైపు రామోజీ రావుకు నివాళిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రేపు, ఎల్లుండి సంతాప దినాలు ప్రకటించింది. రామోజీరావు అస్తమయంపై సంతాపం తెలిపిన ఫిల్మ్‌ఛాంబర్ రేపు సినిమా షూటింగ్‌లకు సెలవు ప్రకటించింది.

**తన పేరు తానే...**

కృష్ణా జిల్లా పెదపారుపూడిలో చెరుకూరి వెంకటసుబ్బారావు, సుబ్బమ్మ దంపతులకు 1936 నవంబర్ 16న రామోజీరావు జన్మించారు. అక్కలు రాజ్యలక్ష్మి, రంగనాయకమ్మ తర్వాత ఆయన జన్మించారు.

మిగతా 3లో..



## 'నీట్'లో అవకతవకలు

# బయటపెట్టాలి

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్, మన చౌరాస్తా :** లక్షలాది మంది వైద్య విద్యార్థుల జీవితాలను ప్రభావితం చేసే నీట్ ఎగ్జామ్ కు సంబంధించిన కొన్ని వ్యవహారాలు చూస్తుంటే కచ్చితంగా అవకతవకలు జరిగినట్లు స్పష్టంగా తెలుస్తుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. నీట్ ఎగ్జామ్ లో జరిగిన అవకతవకలపై ఆయన స్పందించారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈ సంవత్సరం నీట్ ఎగ్జామ్ లో 67 మంది విద్యార్థులు 720/720 మార్కులతో ఫస్ట్ ర్యాంక్ సాధించటం పలు అనుమానాలకు రేపుతున్నాయని పేర్కొన్నారు. దీనికి తోడు ఈ సారి చాలా మంది విద్యార్థులు 718, 719 మార్కులు సాధించారు.. నీట్ పరీక్షలో (+4, 1) మార్కింగ్ విధానం ఉంటుంది. ఈ లెక్కన 718, 719 మార్కులు రావటమన్నది సాధ్యమయ్యే పనికాదు. దీని గురించి ప్రశ్నిస్తే గ్రేస్ మార్కులు ఇచ్చామని చెబుతున్నారని వెల్లడించారు. ''కొంతమంది విద్యార్థులకు ఏకంగా 100 వరకు గ్రేస్ మార్కులు ఇచ్చినట్లు తెలుస్తోంది. గ్రేస్ మార్కుల కోసం ఏ విధానం అవలంభించారన్నది చెప్పకపోవటం ఆశ్చర్యం కలిగిస్తోంది. నీట్ ఫలితాలను ప్రిపోన్ చేసి ఎన్నికల ఫలితాల రోజే హడావుడిగా విడుదల చేయటం కూడా ఎన్నో అనుమానాలను రేకెత్తిస్తోంది. గత 5 ఏళ్లలో తెలంగాణా నుంచి ఏ విద్యార్థి కూడా నీట్ లో టాప్ 5 ర్యాకింగ్‌లో లేరు.

మిగతా 3లో..

## ఇన్‌టైంలో

# రావాలి

- పరీక్ష ప్రారంభానికి అరగంట ముందే గేట్ల మూసివేత
- అభ్యర్థులు చెప్పులు మాత్రమే ధరించాలి
- 14 కేంద్రాల్లో గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష
- జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

3 లో





## బుగులు వెంకన్న


# సన్నిధిలో సీపీ


3 లో

## కుక్కల దాడిలో

# బాలుడి మృతి

3 లో






# అక్షర నివాళి

- రామోజీతో అనుబంధాన్ని గుర్తుచేసుకున్న జర్నలిస్టులు
- సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున పోస్టులు
- 'మన చౌరాస్తా'లో స్పెషల్ పేజీ..

2 లో

మన చౌరస్తా 2
Special Edition
09.06.2024 ఆదివారం epaper.manachourasta.com

### ఈనాడుతో 14 ఏళ్ల అనుబంధం



నా జీవితంలో చాలా కీలకమైన 14 ఏళ్లకాలం ఈనాడుతో ముడిపడింది. ఉప సంపాదకుడిగా చైర్మన్ రామోజీరావును పలు సార్లు దగ్గరగా చూశాను. ఎవరో చెప్పడం కాదు.. ప్రత్యక్షంగా ఉద్యోగులతో ప్రత్యేకించి పాత్రికేయులతో తన ప్రవర్తన, సూక్ష్మ విషయాలపై తన గమనిక, ఎన్నో వర్తమాన అంశాలపై సూచన.. ఇవన్నీ నన్ను జర్నలిస్టుగా మలచిన అంశాలు. దివికేగిన రామోజీరావు నివాళులు.

**- మధుసూదన్ రావు, సీనియర్ జర్నలిస్ట్**


### మీడియా రంగంలో మేరు శిఖరం



ఇవాళ మీడియాలో పనిచేస్తున్న ప్రముఖుల్లో చాలామందికి ఈనాడులో ఎప్పుడో ఒకప్పుడు పనిచేసిన అనుబంధం ఉండడం కామన్‌గా కనిపిస్తుంది. పాత్రికేయరంగంలో నూతన ఒరవడులే కాదు.. కొత్తవారికి పత్రికారచన పట్ల మక్కువ పెంచడం, ఈనాడులో బైలైన్‌తో వార్త వచ్చిందంటే మనం గ్రేటన్నమాట. ఇది నాలాంటి సగటు రిపోర్టర్ సంబురం. ఇది ఆ సంస్థ గొప్పతనం.. వ్యవస్థాపకులు రామోజీరావు విజనరీకి నిలువెత్తు నిదర్శనం.. మీడియా రంగంలో పలు సంస్కరణలకు మూలం. ఈనాడు కల్చరల్ కంట్రిబ్యూటర్‌గా నా పాత్రికేయ ప్రస్థానంలో ఓ మైలురాయే. నేనొక్కడినేకాదు. ఎందరో గ్రౌండ్ లెవల్ రిపోర్టర్లను కలం యోధులుగా తీర్చిదిద్దిన ఘనత ఈనాడుదే..

**- ఎం.రంగనాథ్, సీనియర్ జర్నలిస్ట్**

## చైర్మన్ రామోజీరావుతో 21 నిమిషాలు మాట్లాడిన..



సద్ది తిన్న రేవును తల్చుకోవడం మన సంప్రదాయం. అలాగే చాలా తక్కువ మందికి లభించిన అరుదైన ముచ్చట ఇది. బీఏ పరీక్ష రాసిన నాకు నాలుగు వాక్యాలు రాయగలనని నమ్మి 1982 మే నెలలో కొడకండ్ల పంచాయతీ సమితి కంట్రిబ్యూటర్‌గా నియమించారు. ఆ సమయంలో చైర్మన్ రామోజీరావుతో ఒకసారి 21 నిముషాల పాటు ఎదురుగా కూర్చొని మాట్లాడే భాగ్యం నాకు దక్కింది. జిల్లా టాబ్లాయిడ్ పెట్టబోయేముందు నవంబర్ 15న అన్నీ జిల్లాల కంట్రిబ్యూటర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. అప్పట్లో ములుగు రమేష్ ప్రత్యేక వార్తలు బాగా రాసే వారు. ఆ సమావేశంలో ఆయనను ప్రత్యేకంగా పేరు పెట్టి పిలిచి అభినందించారు. ఆనక మేడారం జాతర లైవ్‌లో నాలుగు మాటలు మాట్లాడేందుకు ఫిల్మ్ సిటీ రప్పించి సితార హోటల్లో బస భోజనం ఆకర్షణీయమైన పారితోషికం ఇచ్చారు. దిన పత్రిక రాగానే కేవలం మన వార్తలు చదివే కంట్రిబ్యూటర్ అనేక మంది. కానీ రామోజీరావు అన్నీ జిల్లాల పేజీలు, మెయిన్ పేజీలు చదివి అక్షర దోషాలు కూడా గమనించి స్కెచ్ పెన్నుతో అండర్ లైన్ చేస్తారనే విషయం కొందరికే తెలుసు. మంచి వార్తకు అభినందనలు తెలిపేవారు. అప్పటి వరకు అనామకంగా ఉన్న నాకు ఎంతో గుర్తింపు పొందిన జీవితాన్ని ఇచ్చిన చైర్మన్ మరణ వార్త కలుక్కుమనిపించింది. మామూలుగా చాలా గొప్పవాళ్లకే రామోజీరావు అందుబాటులో ఉంటారన్నది అసత్యం. ఒక సమితి కేంద్ర కంట్రిబ్యూటర్ ను ఫిల్మ్ సిటీకి రప్పించుకొని అంత సేపు మాట్లాడడం ఆయన ఒక్కడికే సాధ్యమయ్యింది. అప్పటి యూనిట్ మేనేజర్ భాస్కర చంద్రశేఖర్ గారు మాలో చాలామందికి దక్కని భాగ్యం మీకు కలిగిందని అభినందించారు. దేవలోకంలో కూడా ఒక సమర్థుడు కావాలనే భగవంతుడు రామోజీరావు స్వర్గలోకానికి తీసుకెళ్లరేమో.. ఆయన స్ఫూర్తి నీ కొనసాగించడమే మన నిజమైన నివాళి.

**- ఉప్పల రమేశ్‌శర్మ, సీనియర్ జర్నలిస్ట్, దేవరుప్పల**


# జర్నలిస్టుల అక్షర నివాళి

## రామోజీరావుతో అనుబంధంపై సోషల్ మీడియాలో పోస్టులు

**వ్యక్తిగా మీరు వెళ్లిపోయారు. కానీ శక్తిగా నాలాంటి ఎందరిలోనో ఉండిపోయారు. మీ ప్రాభవం.. మీ జ్ఞాపకం.. మీ సంతకం.. తెలుగునేలపై చెదరని చరిత్ర.. ఈనాడు అధినేత సి.హెచ్ రామోజీరావు మరణ వార్తతో జర్నలిస్టు లోకం గొల్లుమంది.. ఆ సంస్థలో ఓనమాలు దిద్ది ఎదిగిన ఎంతో మంది జర్నలిస్టులు పత్రికారంగంలో రామోజీరావు చేసిన సేవలను కొనియాడారు. ఆయనతో జ్ఞాపకాలను సోషల్ మీడియాలో పోస్టులు చేసి నివాళులర్పించారు.**

*- మన చౌరాస్తా, వెబ్ డెస్క్*







## తెలుగు రాష్ట్రాలకు తీరని లోటు

**ఈనాడు అధినేత రామాజీరావు మృతి తెలుగు రాష్ట్రాలకు తీరని లోటు. గత కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన కన్నుమూయడం బాధాకరం. రామోజీరావు ఈనాడు సంస్థలు, మార్గదర్శి చిట్‌ఫండ్స్, ప్రియా ఫుడ్స్ వంటి వ్యాపారాలు నెలకొల్పి ఎంతో మందికి ఉపాధి కల్పించారు. అంతేగాక రామోజీ ఫిల్మ్ సిటీ ఏర్పాటు చేసి హైదరాబాద్, సినీ పరిశ్రమ అభివృద్ధిలో భాగమయ్యారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆశిస్తున్నా.**

**- సీతక్క, పంచాయతీరాజ్ శాఖ మంత్రి**



### పత్రికారంగంలో కొత్త చరిత్ర

ఈనాడు జర్నలిజం స్కూల్ లేకపోయి ఉంటే నా కెరియర్ ఎలా ఉండేదో..! వేలాది మంది జర్నలిజం అక్షరాలు దిద్దడానికి కారణమైన రామోజీరావు మరణవార్తతో ఇవాళ తెల్లారింది. ఆయనను కలిసిన క్షణాలు గుర్తొస్తున్నాయి. సూర్యుడి కంటే ముందే ఈనాడు ఇంటికొచ్చేలా తెలుగు పత్రికా రంగంలో కొత్త చరిత్ర లిఖించిన యోధుడికి అశ్రునివాళి.

**- తులసీ చందు, సీనియర్ జర్నలిస్ట్**

### అక్షర యోధుడా అశ్రు నివాళి



ఈనాడు జర్నలిజం స్కూల్లో వేసిన తొలి అడుగులతోనే నేడు నేను ఇక్కడున్నది. జర్నలిస్టుగా ఓమాలు నేర్పిన ఈనాడు ఎప్పుడు రుణపడే ఉంటా. అక్షర యోధుడా నీకు అశ్రు నివాళి

*- రైతు బడి రాజేందర్‌రెడ్డి*

### ఈనాడు అధినేతకు నివాళి



ఈనాడు వ్యవస్థాపక సంపాదకులు రామోజీరావు మరణం విచారకరం. రామోజీరావు సంపాదకత్వంలో 1974 లో ప్రారంభమైన ఈనాడు దినపత్రిక ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో పత్రికారంగంలో నూతన ఒరవడిని సృష్టించింది. ఈనాడు, యూటీఎఫ్ ఒకే రోజు (1974 ఆగస్టు 10) ఆవిర్భవించటం యాదృచ్ఛికమే అయినప్పటికీ, తెలుగు రాష్ట్రాల్లో పత్రికారంగంలో ఈనాడు, ఉపాధ్యాయ రంగంలో యూటీఎఫ్ అగ్రశ్రేణిలో నిలవడం విశేషం. రామోజీరావుకు టీఎస్ యూటీఎఫ్ పక్షాన నివాళులు. ఆయన కుటుంబ సభ్యులకు, ఈనాడు సిబ్బందికి ప్రగాఢ సానుభూతిని ప్రకటిస్తున్నాం.

*- మదూరి వెంకటేష్, టీఎస్ యూటీఎఫ్*

### సంచలన నిర్ణయాలు ఆయన సొంతం



**ఈనాడు రామోజీరావు మరణ వార్త చాలా బాధ కలిగించింది. పత్రికా రంగానికి ఎందరో జర్నలిస్టులను అందించిన ఘనత రామోజీరావుది. నేడు తెలుగు మీడియాలో ఉన్న టాప్ జర్నలిస్టుల అత్యధికులు ఈనాడు జర్నలిజం స్కూల్‌లో శిక్షణ పొందినవారే. నేను కూడా ఈజేఎస్ నుంచి వచ్చిన వాడినే. మీడియ రంగంలో రామోజీరావు ఎన్నో విప్లవాత్మక మార్పులు తెచ్చారు. జిల్లా ఎడిషన్స్ పెట్టడం ఆ రోజుల్లో ఒక సంచలనం. తర్వాత అందరూ ఫాలో అయ్యారు. ఎలక్ట్రానిక్ మీడియాలో ఈటీవీ గ్రూప్ మరో సంచలనం. ఈ విధంగా చెప్పుకుంటూ పోతే చాలా పెద్ద పుస్తకం రాయగలను. తెలుగు సమాజానికి రామోజీరావు మృతి తీరని లోటు.. ఓం శాంతి..** *- సంగప్ప, బీజేపీ నేత*

### ఓ మార్గదర్శి.. ఇక సెలవు



**జర్నలిజం రంగంలో కొన్ని వేలమంది తాము సీనియర్ జర్నలిస్టులమని.. చెప్పకుంటున్నారంటే అందుకు ఈనాడే. ఈనాడు ద్వారా లక్షలాదికి మందికి అన్నం పెట్టిన వ్యక్తి రామోజీరావు. ఆ లక్షలాది వ్యక్తుల్లో నేనూ ఒకడిని. మీ జీవితం ఎప్పటికీ.. ఎన్నటికీ స్ఫూర్తిదాయకమే. మిమ్మల్ని పొగడాలంటే. ఈ నాలుగు మాటలు చాలవు. మీరు నిజంగా భావితరానికి మార్గదర్శి.. ఓ మహర్షి... మార్గదర్శీ ఇక సెలవు.**

*- యాసం నాగరాజు, సీనియర్ జర్నలిస్ట్*

### చాలా బాధాకరం..



**ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు మరణం చాలా బాధాకరం. తెలుగు జర్నలిజాన్ని విశ్వవ్యాప్తి చేసిన ఘనత ఆయనకే సొంతం. తెలుగు భాష కలుషితమవుతున్న పరిస్థితుల్లో మాతృభాషకు పట్టం కట్టిన మహోన్నతమైన వ్యక్తి. నాకు ఈనాడు సంస్థలో జర్నలిస్టుగా పనిచేసే అవకాశం వచ్చినప్పుడు చాలా గొప్పగా భావించాను. నా జర్నలిజం జర్నీలో క్రమశిక్షణను నేర్పింది ఈనాడే.. ఎంతోమంది జర్నలిస్టులకు జర్నలిజంలో అవకాశాలు కల్పించి జీవనోపాధి చూపించిన ఈనాడు సంస్థ రుణం తీర్చుకోలేనిది. రామోజీరావు శివైక్యం చెందడం తెలుగు ప్రజలకు తీరని లోటు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని కోరుకుంటున్నా..**

*- అల్లం రాజేష్ వర్మ, సీనియర్ జర్నలిస్ట్*



రామోజీరావు భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న జనగామకు చెందిన టీడీపీ, బీఆర్ఎస్ లీడర్లు రామిని హరీశ్, మల్లిగారి రాజు






### అక్షర యోధుడు...

ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత చెరుకూరి రామోజీరావు మరణం చాలా బాధాకరం. రామోజీ రావు స్థాపించిన ఈనాడు తో నాకు పాతికేళ్ల అనుబంధం ఉంది. నేను 1994 నుంచి 2018 వరకు మెదక్ ఈనాడు విలేకరిగా పనిచేసాను. క్రమశిక్షణ, నిబద్ధత, కమిట్మెంట్‌తో పని చేయడం ఈనాడు సంస్థలో పని చేయడం ద్వారా నేర్చుకున్నాను. నేను ఎలాంటి శిక్షణ తీసుకోకున్నా, జర్నలిజం కోర్సు చేయకున్నా.. ప్రజా సమస్యలు, అభివృద్ధి పనులు, రాజకీయ, క్రైమ్, ఇన్వెస్టిగేషన్, స్పోర్ట్స్.. ఫీచర్స్.. ఇలా ఎలాంటి అంశంపై అయిన జిల్లా, మెయిన్ పేజీలకు, సండే మేగజైన్లకు కథనాలు రాయడం ఈనాడులో పని చేయడం ద్వారా నేర్చుకున్నాను. నేను మండల కంట్రి బ్యూటర్ స్థాయి నుంచి స్టాఫ్ రిపోర్టర్ గా ఎదగడానికి ఈనాడు బాటలు వేసింది. సమాజంలో నాకంటూ ఓ గుర్తింపు వచ్చిందంటే అది ఈనాడు వల్లే. పత్రికా రంగానికి రామోజీ రావు లేని లోటు తీరనిది.

**- తిమ్మన్నగారి శ్రీధర్, సీనియర్ జర్నలిస్ట్**

# అక్షర సూర్యుడికి అశ్రునివాళి



(మొదటి పేజీ తరువాయి)

కుటుంబ సభ్యులు రామోజీకి తాతయ్య రామయ్య పేరు పెట్టారు. బడిలో మాస్టారుకు తన పేరు రామోజీరావు అని చెప్పి తన పేరును తనే పెట్టుకున్నారు.

## విలక్షణమే...

చిన్నప్పటి నుంచే విలక్షణ, సృజనాత్మకత ఉన్న వ్యక్తి ఆయన. ఈనాడు దినపత్రికను ప్రారంభించి తెలుగునాట సంచలనం సృష్టించారు. 1974 ఆగస్టు 10న విశాఖ సాగర తీరంలో 'ఈనాడు'ను ప్రారంభించారు. ప్రారంభించిన నాలుగేళ్లలోనే పాఠకుల మానసపుత్రికగా ఈనాడు మారింది. ఈనాడుతో పాటు కీలక మైలురాయిగా 'సితార' సినీ పత్రిక నిలిచింది.

## కొత్త దారుల సృష్టికర్త

బహుముఖ ప్రజ్ఞ కఠోర సాధన ఇవే రామోజీ రావు అస్త్రాలు. నలుగురు నడిచిన బాట కాదు కొత్త దారులు సృష్టించడం ఆయన నైజం. లక్ష్య సాధనకు దశాబ్దాలపాటు నిర్విరామంగా పరిశ్రమించిన యోధుడు. రైతుబిడ్డగా మొదలై వ్యాపారవేత్తగా రాణించారు. మీడియా మహా సామ్రాజ్యాన్ని నిర్మించిన ఆయన చైతన్యదీప్తుల్లాంటి చిత్రరాజాలను సృజించారు.

## అద్భుత సృష్టి...

అద్భుత ఫిల్మ్‌సిటీని సృష్టించారు. తెలుగువారి హృదయాల్లో చెరగని ముద్ర వేశారు. ఆఖరి క్షణం వరకూ ప్రజా శ్రేయస్సు కోసమే పరితపించారు. పనిలోనే విశ్రాంతి అనేది రామోజీ రావు ప్రాథమిక సూత్రం. చివరి క్షణం వరకు పనిలోనే విశ్రాంతి సిద్ధాంతాన్ని పాటించిన మహనీయుడు.

## వేల మందికి ఉద్యోగ, ఉపాధి..

అడుగుపెట్టిన ప్రతి రంగంలోనూ రామోజీరావు చెరగని ముద్ర వేశారు. 1962లో మార్గదర్శి చిట్ ఫండ్స్‌ను స్థాపించారు. దేశంలోనే అగ్రశ్రేణి చిట్ ఫండ్స్ సంస్థగా మార్గదర్శి నిలిచింది. 60 సంవత్సరాల్లో లక్షలాదిమంది ఖాతాదారులకు నిబద్ధతతో సేవలు అందించారు. ఈ సంస్థ ద్వారా వేల మందికి ఉద్యోగ ఉపాధి కల్పించారు.











# రామోజీకి ఎమ్మెల్యే కడియం నివాళి

**స్టేషన్‌ఘన్‌పూర్, మన చౌరాస్తా :** అక్షర యోధుడు, ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత, పద్మవిభూషణ్ రామోజీ రావు మరణ వార్త తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే, మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి అన్నారు. హైదరాబాద్ రామోజీ ఫిలిం సిటీలో ఉంచిన రామోజీ రావు పార్థివదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అక్షర యోధుడు, పత్రికా రంగానికి నూతన ఒరవడిని సృష్టించిన గొప్ప మహానుభావుడు రామోజీ రావు అలాంటి వ్యక్తి ఇక మన మధ్య లేడు అనే విషయం చెప్పడానికే చాలా బాధగా ఉందని అన్నారు. ఒక సామాన్య రైతు కుటుంబంలో పుట్టి స్వయంకృషితో ఎదిగిన గొప్ప దార్శినికుడు రామోజీ రావుని తెలిపారు. మీడియా రంగంలో, సినిమా రంగంలో ఆయన అందించిన సేవలు మారువలేనివని, రామోజీ రావు గారిని కోల్పోవడం దేశానికి తీరని లోటని తెలిపారు.



# వెంకన్న సన్నిధిలో వరంగల్ సీపీ

**స్టేషన్‌ఘన్‌పూర్, మన చౌరాస్తా :** జనగామ జిల్లా చిల్పూర్ మండల కేంద్రంలోని శ్రీ బుగులు వెంకటేశ్వర స్వామిని పోలీస్ కమిషనర్ (సిపి) అంబర్ కిషోర్ జా దంపతులు, కుటుంబ సభ్యులు శనివారం దర్శించుకున్నారు. ప్రతి శనివారము నిర్వహించే వార కళ్యాణం కన్నుల పండుగగా నిర్వహించారు. వరంగల్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (సిపి) అంబర్ కిషోర్ఝా దంపతులు కుటుంబ సభ్యులతో పాల్గొని కళ్యాణ మహోత్సవంలో పాల్గొని ముడుపులు చెల్లించుకున్నారు. వివిధ గ్రామాలు, పట్టణాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ స్వామి వారి కళ్యాణం తిలకించినారు. శివునిపల్లి వాస్తవ్యులు వేముగంటి శ్రీనివాస్ సంగీత అన్నదానము, మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి బి.లక్ష్మీ ప్రసన్న, జూనియర్ అసిస్టెంట్ రమేష్ అర్చకులు బ్రాహ్మణపల్లి రవీందర్ శర్మ, సౌమిత్రి రంగాచార్యులు, కృష్ణమాచార్యులు మరియు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# కుక్కల దాడిలో బాలుడు మృతి



**స్టేషన్‌ఘన్‌పూర్, మన చౌరాస్తా :** వీధి కుక్కల దాడిలో గుగులోత్ శివరాం అనే ఆరేళ్ల బాలుడు మృతి చెందిన సంఘటన జనగామ జిల్లా చిల్పూర్ మండలం ఫతేపూర్ లో శనివారం జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. ఫతేపూర్ శివారు లూనావత్ తండాకు చెందిన గుగులోత్ మధు సరితలకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు తల్లిదండ్రులతో వ్యవసాయ భావి వద్దకు వెళ్లగా చిన్న కుమారుడు శివరాం ఇంటి వద్ద ఉన్నాడు. ఒంటరిగా ఉన్న శివరాంపై వీధి కుక్కలు దాడికి దిగాయి. భయంతో పరిగెత్తుతున్న బాలుడి పై కుక్కలు మూకుమ్మడి దాడి చేయడంతో బాలుడు మృతి చెందాడు. సాయంత్రం ఇంటికి చేరిన కుటుంబ సభ్యులు బాలుడు శివరాం ఆచూకీ కోసం వెతకగా తండాకు దూరంగా వ్యవసాయ పొలాల్లో బాలుడి మృతదేహం లభించడంతో కన్నీరు మున్నూరుగా విలపించారు. విషయం తెలుసుకున్న స్థానికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి గిరిజనులు కన్నీళ్ల పర్యంతమయ్యారు. గ్రామంలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని వాటి బారి నుండి కాపాడాలని అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఇన్‌టైంలో సెంటర్‌కు రావాలి

- పరీక్ష ప్రారంభానికి అరగంట ముందే గేట్లు మూసివేత
- అభ్యర్థులు చెప్పులు మాత్రమే ధరించాలి
- 14 కేంద్రాల్లో గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష
- జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**జనగామ, మన చౌరాస్తా :** గ్రూప్1 ప్రిలిమ్స్ పరీక్ష రాసే అభ్యర్థులు సకాలంలో సెంటర్‌కు చేరుకోవాలని పరీక్ష ప్రారంభానికి అరగంట ముందే (10 గంటలకు) గేట్లు మూసివేస్తారని జనగామ కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఏబీవీ ప్రభుత్వ డిగ్రీ & పీజీ కళాశాల, క్రీస్తుజ్యోతి ఇంజినీరింగ్ కాలేజీలో ఏర్పాటు చేసిన గ్రూప్1 ప్రిలిమ్స్ పరీక్ష కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా పరీక్ష కేంద్రాల్లో ఏర్పాటు చేసిన మౌలిక వసతులు, మెడికల్ కిట్, తదితరాల విషయాల గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. సీసీ కెమెరాలను పరిశీలించి, సిబ్బందికి తగిన సూచనలు చేశారు. తరగతి గదులను తనిఖీ చేసి, బెంచీలపై అతికించిన హాల్ టికెట్ల నంబర్ లను అత్యంత జాగ్రత్తగా, సరైన విధంగా ఉండేలా సరిచూసుకోవాలని ఆదేశించారు. అలాగే బ్లాక్ బోర్డుపై అభ్యర్థుల సీటింగ్ వివరాలు, పరీక్ష కేంద్రాల ముందు సూచిక వివరాల వంటి అంశాలపై ఆరా తీశారు.

563 గ్రూప్1 పోస్టులకుగాను నేడు ఉదయం 10.30 గంటల నుంచి ఒంటి గంట వరకు ఈ ప్రిలిమ్స్ పరీక్ష జరగనుందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో మొత్తం 3,697 మంది అభ్యర్థులు 14 పరీక్ష కేంద్రాల్లో ఈ పరీక్షకు హాజరుకానున్నట్లు వివరించారు. నిరంతర విద్యుత్ సరఫరా జరిగేలా చర్యలు తీసుకున్నామని వివరించారు. పరీక్ష సమయానికి 144 సెక్షన్ అమల్లో ఉంటుందని పేర్కొన్నారు. అభ్యర్థులకు ఆర్టీసీ బస్సులు సరిపడా అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

అభ్యర్థులకు జిల్లా కలెక్టర్ కీలక సూచనలు

అభ్యర్థులు టీజీపీఎస్సీ వెబ్ సైట్ ద్వారా గ్రూప్1 ప్రిలిమ్స్ హాల్ టికెట్లు డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్ ఫోన్లకు అనుమతి లేదన్నారు. పరీక్షార్థులు హాల్ టికెట్ ను ఏ4 సైజ్ పేపర్ లో కలర్ ప్రింట్ తీసుకోవాలని సూచించారు. హాల్ టికెట్ పై అభ్యర్థులు తమ తాజా పాస్ పోర్టు ఫోటోను అతికించాలన్నారు. డౌన్లోడ్ చేసిన హాల్ టికెట్ పై ఫోటో సరిగా ముద్రించి లేకుంటే, అభ్యర్థి గెజిటెడ్ అధికారి లేదా చివరగా చదువుకున్న విద్యాసంస్థ ప్రిన్సిపల్ అటెస్ట్ తో మూడు పాస్ పోర్టు ఫోటోలతో పాటు వెబ్ సైట్ లో పొందుపరిచిన ధ్రువీకరణ పత్రాన్ని పూర్తిచేసి ఇన్విజిలేటర్ కు అందించాలని తెలిపారు. పరీక్ష కేంద్రాలకు సకాలంలో చేరుకోవాలని, ఉదయం 9 గంటల నుంచే పరీక్ష హాల్లోకి అనుమతిస్తామని, 9.30 గంటలకు బయోమెట్రిక్ అటెండెన్స్ ప్రారంభమవుతుందని, పరీక్ష ప్రారంభానికి అరగంట ముందే (10 గంటలకు) గేట్లు మూసివేస్తామని, పరీక్ష రాసే అభ్యర్థులు చెప్పులు మాత్రమే ధరించాలని, అభరణాలు ధరించరాదని సూచించారు. పరీక్షార్థులు మెహిందీ, తాత్కాలిక టాటూలను వేసుకోరాదని స్పష్టం చేశారు. పరీక్ష రాసే అభ్యర్థులు హాల్ టికెట్ ను, బ్లూ (లేదా) బ్లాక్ బాల్ పాయింట్ పెన్ తో పాటు గుర్తింపు పొందిన ప్రభుత్వ ఒరిజినల్ ఐడెంటిటీ కార్డును తప్పనిసరిగా తమ వెంట తీసుకెళ్లాలని సూచించారు. పరీక్ష సమయ పాలనకు సూచికగా ప్రతీ అర్థగంటకోసారి బెల్ మోగుతుందని తెలిపారు.



# సెకన్ ఆలస్యమైనా అనుమతించం

- నేటి గ్రూప్1 పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేశాం
- అడిషనల్ కలెక్టర్ రాధికా గుప్తా



**హనుమకొండ, మన చౌరాస్తా :** ఈనెల 9 తేదిన ఆదివారం జరగనున్న గ్రూప్1 ప్రిలిమినరీ పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు హనుమకొండ జిల్లా అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీస్) రాధికా గుప్తా అన్నారు. పరీక్ష రోజు ఉదయం 9 గంటల నుండి అభ్యర్థులను పరీక్ష హాల్లోకి అనుమతిస్తారని, 10 గంటలకు పరీక్ష కేంద్రాల గేట్లని మూసివేస్తారని, 10 గంటల తర్వాత సెకండ్ ఆలస్యం అయినా ఎవరిని అనుమతించడం జరగదని తెలిపారు. పరీక్షకు వచ్చిన అభ్యర్థులు హాల్ టికెట్ నందున్న నియమ నిబంధనలు తప్పకుండా పాటించాలన్నారు. అభ్యర్థులు తమకు కేటాయించిన పరీక్ష కేంద్రాన్ని ముందస్తుగా చూసుకున్నట్లయితే పరీక్ష రోజు పరీక్ష కేంద్రానికి సులువుగా చేరుకోవచ్చు అని, పరీక్ష రాయడానికి (బబ్లింగ్) బ్లాక్ లేదా బ్లూ బాల్ పెన్ను మాత్రమే అనుమతిస్తారని తెలిపారు. పరీక్ష హాల్లోనికి మొబైల్ ఫోన్స్, స్మార్ట్ వాచ్, క్యాలిక్యులేటర్, వైట్ పేపర్స్, పెన్ డ్రైవ్, టాబ్లెట్, హియరింగ్ సొల్యూషన్స్ సంబంధించిన ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్ అనుమతించడం జరగదని తెలిపారు. అలాగే అభ్యర్థులు షూస్ కాకుండా కేవలం చెప్పల్స్ మాత్రమే ధరించి రావాలని తెలిపారు. తర్వాత పరీక్ష పూర్తయిన తర్వాత మధ్యాహ్నం 1 గంట వరకు ఎవరినీ బయటకు పంపించడం జరగదని, అభ్యర్థులు పరీక్ష రాసిన తర్వాత ప్రశ్నాపత్రం తమతో పాటు తీసుకువెళ్లడానికి వీలుగా ఉంటుంది అన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద ఉదయం 6 గంటల నుండి 144 సెక్షన్ అమల్లో ఉంటుందని అదనపు కలెక్టర్ రాధికా గుప్తా తెలిపారు. అలాగే గ్రూప్1 పరీక్ష రాసే అభ్యర్థులకు ఆమె ఆల్ ది బెస్ట్ తెలిపారు.

# 'నీట్'లో అవకతవకలు బయటపెట్టాలి

(మొదటి పేజీ తరువాయి)

దీనికి కచ్చితంగా నీట్ ఎగ్జామ్ లో జరుగుతున్న అక్రమాలే కారణమని మేము నమ్ముతున్నాం. గ్రేస్ మార్కుల కేటాయింపు కోసం అనుసరించిన విధానాన్ని బయటపెట్టాలని డిమాండ్ చేస్తున్నాం. ఒక ప్రామాణిక పద్ధతిలో ప్రతి విద్యార్థికి మేలు చేసేలా ఈ విధానం ఉండాలని బీఆర్ఎస్ కోరుతుంది. కానీ కొంత మంది విద్యార్థుల గ్రూప్‌కు మాత్రమే మేలు చేసే విధంగా గ్రేస్ మార్కులు కలిపారు. అది సరైన విధానం కాదు. ఈ మొత్తం వ్యవహారంపై హై లెవల్ ఎక్స్ పర్ట్ కమిటీతో విచారణ జరిపించాలని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తోంది. నీట్ ఎగ్జామ్ లో జరిగిన అవకతవకలు, అక్రమాలను బయటపెట్టి అన్యాయం జరిగిన విద్యార్థులకు వారి కుటుంబాలకు న్యాయం చేయాలి. అక్రమాలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి.'' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు.



## తెలంగాణ ఈసెట్ 2024

# ప్రవేశాలు ప్రారంభం

**హనుమకొండ, మన చౌరాస్తా :** పాలిటెక్నిక్ డిప్లమా పూర్తి చేసిన వారికి రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీ, ఇతర ఇంజనీరింగ్ కళాశాలలో నేరుగా B.Tech. రెండవ సంవత్సరములో ప్రవేశం కోసం నిర్వహించిన ఈసెట్ 2024 లో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు 202425 సంవత్సరానికి అడ్మిషన్ల ప్రక్రియ తెలంగాణ ఉన్నత విద్య మండలి చేపట్టినట్లు వరంగల్ జిల్లా హెల్ప్ లైన్ సెంటర్ క్యాంపు ఆఫీసర్ డా. బైరి ప్రభాకర్ తెలిపారు. వరంగల్ జిల్లా కేంద్రంలో గవర్నమెంట్ పాలిటెక్నిక్, వరంగల్ యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్, సుబేదారిలో విద్యార్థులు ధ్రువపత్రాల పరిశీలన కొరకు ఈ నెల 8వ తేదీ నుండి 11వ తేదీ వరకు స్లాట్ బుక్ చేసుకోవాలన్నారు. ఈ నెల 10 నుండి 12 వ తేదీ వరకు ధ్రువపత్రాల పరిశీలన జరుగుతుందని చెప్పారు. స్లాట్ బుకింగ్ చేసుకొన్న విద్యార్థులు సమయానికి 30 నిమిషాల ముందు కౌన్సిలింగ్ కేంద్రం వద్ద రిపోర్ట్ చేయవలసి ఉంటుంది. విద్యార్థులు ఈసెట్ 2024 హాల్ టికెట్, ర్యాంకు కార్డు, ఆధార్ కార్డు, ఎస్ఎస్‌సీ మెమో, డిప్లమా ప్రొవిజినల్ సర్టిఫికెట్, మెమో, 7వ తరగతి నుండి డిప్లమా వరకు స్టడీ, కులం, ఆదాయం ధ్రువీకరణ ఒరిజినల్ కార్డులతో పాటు ఒక సెట్ జిరాక్స్ కాపీ కూడా తీసుకొని రావలసి ఉంటుంది. రాష్ట్రంలోని అన్ని ఇంజనీరింగ్ కళాశాలలో 10 శాతం సీట్స్ తో పాటు మొదటి విద్య సంవత్సరంలో నిండకుండా మిగిలి పోయిన సీట్స్ కు ఈసెట్ ఉత్తీర్ణులైన విద్యార్థులు వెబ్ ఆప్షన్స్ ఇచ్చుకొనే అవకాశం వుందని తెలిపారు. ఈ నెల 18వ తేదీన సీట్ల కేటాయింపు జరుగుతుందని చెప్పారు. సీట్స్ పొందిన విద్యార్థులు ఈ నెల 18వ తేదీ నుండి 21వ తేదీ వరకు www.tgecet.nic.in వెబ్ సైట్ నందు లాగిన్ అయి ఫీజు చెల్లించి ఆన్లైన్ లోనే సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని వరంగల్ హెచ్ఎల్‌సీ క్యాంపు ఆఫీసర్ డా. బైరి ప్రభాకర్ తెలిపారు.

### ధమాకా బ్యూటీ..

# బాలీవుడ్‌లోకి..

## స్టార్ హీరో కొడుకుతో శ్రీలీల రోమాన్స్

**మన చౌరాస్తా, సినిమా :** టాలీవుడ్ మోస్ట్ వాంటెడ్ హీరోయిన్ అంటే ఠక్కున గుర్తొచ్చే పేరు శ్రీలీల. పెళ్లి సందడి సినిమాతో తెలుగు తెరకు పరిచయమై ధమాకా మూవీతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. ఈ సినిమా తర్వాత తెలుగు సినీ పరిశ్రమలో శ్రీలీల క్రేజ్ ఒక్కసారిగా మారిపోయింది. దీంతో ఒకే ఏడాది దాదాపు అరడజనుకు పైగా సినిమాలను అనౌన్స్ చేసి ఆశ్చర్యపరిచింది. కంటెంట్‌తో సంబంధం లేకుండా వరుస ఆఫర్లకు గ్రీన్ సిగ్నల్ ఇస్తూ వెండితెరపై సందడి చేసిన ఈ బ్యూటీకి కొన్ని చిత్రాలు షాకిచ్చాయి. బ్యాక్ టూ బ్యాక్ హిట్స్ అందుకుంటూ ఫుల్ ఫాంలో ఉన్న శ్రీలీల ఖాతాలో కొన్ని డిజాస్టర్స్ వచ్చి చేరాయి. దీంతో సినిమాల ఎంపికపై కాస్త దృష్టి పెట్టింది. కంటెంట్, పాత్ర ప్రాధాన్యత చూసి సినిమాలు ఎంచుకోవాలని నిర్ణయించుకుందట. దీంతో కొన్ని రోజులుగా మరో ప్రాజెక్ట్ అనౌన్స్ చేయకుండా సైలెంట్ అయ్యింది. ఈ క్రమంలో తాజాగా శ్రీలీలకు సంబంధించిన ఓ న్యూస్ ఇప్పుడు నెట్టింట వైరలవుతుంది. అదెంటంటే.. ఇన్నాళ్లు తెలుగు ఇండస్ట్రీలో సత్తా చాటిన ఈ బ్యూటీ ఇప్పుడు బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇస్తుందట. హిందీలో స్టార్ హీరో సైఫ్ అలీ ఖాన్ కుమారుడు ఇబ్రహీం అలీఖాన్ హీరోగా ఇంట్రడ్యూస్ కానున్నాడు. మొదటి నుంచి డైరెక్షన్ పై ఫోకస్ చేసిన ఇబ్రహీం.. ఇప్పుడు హీరోగా బిగ్ స్క్రీన్ పై సందడి చేసేందుకు రెడీ అయ్యాడట. కరణ్ జోహార్ తెరకెక్కించిన రాకీ ఔర్ రాణికి ప్రేమ్ కహానీ సినిమాకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసిన ఇబ్రహీం హీరోగా అడియన్స్ ముందుకు రాబోతున్నాడు. ప్రస్తుతం సర్జమీన్ అనే చిత్రంలో నటిస్తున్నాడు. ఇందులో కాజోల్, పృథ్వీరాజ్ సుకుమారన్ కీలకపాత్రలు పోషించగా.. ధర్మ ప్రొడక్షన్ బ్యానర్ పై నిర్మిస్తున్నారు. ఇక ఇబ్రహీం నటించే రెండో సినిమా దిలేర్ లో శ్రీలీల కథానాయికగా నటించనుందని టాక్ వినిపిస్తుంది. ఈ మూవీతోనే బాలీవుడ్ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టనుంది. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్ గురించి శ్రీలీలను కాంటాక్ట్ కాగా.. గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసింది. ఈ చిత్రానికి కునాల్ దేశ్ ముక్ దర్శకత్వం వహించనున్నారు. అందమైన ప్రేమకథగా రాబోతున్న ఈ మూవీ రెగ్యూలర్ షూటింగ్ ఆగస్టులో స్టార్ట్ కానుందని తెలుస్తోంది. త్వరలోనే ఈ ప్రాజెక్ట్ గురించి అధికారిక ప్రకటన రానుంది.

